క్లుప్తంగా

బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి

పాతమంచిర్యాల: చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి 50శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. బీసీలకు రిజర్వేషన్‌లు పెంచాలని ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం బీసీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తమకు రావాల్సిన ప్రజాస్వామ్య వాటా కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌ల సాధన కోసం ఈ నెల 6న శుక్రవారం నిర్వహించే సైకిల్ యాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, నాయకులు ఆరెందుల రాజేశం, పల్లపు రాజు, అరుణ్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

భీమారం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమారం బ్రాంచి ద్వారా రుణాలు తీసుకొని చెల్లించనివారి కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో భాగంగా ఈ నెల 14న బ్యాంకు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు బ్యాంకు మేనేజర్ సుబ్బారెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులు పూర్తి వివరాల కోసం బ్రాంచిలో సంప్రదించాలని ఆయన కోరారు.

వయోజన విద్యా కేంద్రాల ఏర్పాటు

లక్సెట్టిపేట: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో న్యూ లైఫ్ ప్రేయర్ సొసైటీ ఆధ్వర్యంలో ఐదు వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బొడ్డు రవి జోసెఫ్ మాట్లాడుతూ.. గ్రామంలో చాలా మంది వ్యక్తులు చదువుకోవాలనే ఉద్దేశంతో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు శ్యామ్‌రిజాయిస్, వరలక్ష్మి, సుమలత, రాణి, రాధిక, మౌనిక, లింగయ్య, వినయ్ పాల్గొన్నారు.

భక్తులకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న అయ్యప్ప స్వాములు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నుంచి శబరిమలకు అయ్యప్ప వరకు పాదయాత్ర చేసి తిరిగి వచ్చిన అయ్యప్ప భక్తులు బోడ రామకృష్ణ, ఖమ్మం ఐలయ్యకు శ్రీరాంపూర్ అయ్యప్ప స్వాములు ఘన స్వాగతం పలికారు. 47రోజుల పాటు 4 రాష్ట్రాల మీదుగా 1600కిలో మీటర్ల పాదయాత్ర చేసి అయ్యప్పను దర్శించుకొని తిరిగి ఇంటికి చేరుకున్న సందర్భంగా సోమవారం శ్రీరాంపూర్ బస్టాండ్‌లో వారిని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) శ్రీరాంపూర్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాదు వీరభద్ర స్వామి, మహిళలు మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.

సీపీఐ నాయకుడికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నస్పూర్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ శనివారం గుండెపోటుతో మృతి చెందిన నక్క బాలమల్లేశ్‌కు సీసీసీలోని నర్సయ్య భవన్‌లో సోమవారం జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయకార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, జిల్లా సమితి సభ్యులు రాజేశ్వర్‌రావు, మొగిళి లక్ష్మణ్, జోగుల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం



చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లిలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి ప్రమాదకరంగా ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకొని పిచ్చి మొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నిషేధాజ్ఞలు బేఖాతరు!

- బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం పార్టీలు
- మందుబాబులకు అడ్డాగా క్రీడామైదానాలు
- మత్తులో రెచ్చిపోతున్న యువత
- నిఘా పెంచాలని కోరుతున్న పట్టణ ప్రజలు



ఇటీవల టీటీడీ కళ్యాణ మండపం వద్ద మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేయగా గుమిగూడిన జనం (ఫైల్)

మంచిర్యాలక్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు అమలు చేసినా మందుబాబులు బేఖాతరు చేస్తున్నారు. రామగుండం సీపీ శ్రీనివాసులు ప్రతి నెలా నిషేధాజ్ఞలు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, కేవలం అవి పత్రికా ప్రకటనలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలున్నాయి. మద్యం సేవించిన అనంతరం మందు బాటిళ్లను అక్కడే పగలగొట్టడం, తినుబండారాలు అక్కడే చెల్లాచెదురుగా పడేయడంతో అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

మద్యం మత్తులో నేరాలు...

జిల్లాలో కొంతమంది యువకులు నేర ప్రవృత్తికి అలవాటు పడుతున్నారు. మద్యం, గంజాయి, వంటి వాటికి బానిసలు అవుతున్నారు. మత్తులో ఎదుటివారిపై అకారణంగా దాడి చేయడం, అలజడులు సృష్టిస్తున్నారు. పలుచోట్ల బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి సేవిస్తూ దారి దోపిడీలకు పాల్పడుతున్నారు.

- ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని లక్ష్మి టాకీస్ సమీపంలో శ్రీరాంపూర్‌లోని క్రిష్ణ కాలనీకి చెందిన ఫైనాన్స్ వ్యాపారి నగమోతు రమేశ్‌పై మద్యం మత్తులో కొందరు వ్యక్తులు దాడి చేశారు.
- ఈ నెల 27న స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఓ యువకుడు మత్తులో ఉండి రోడ్డుపై వెళ్తున్న మరో యువకుడిపై దాడి చేశాడు. ఇది గమనించిన స్థానికులు 100డైల్‌కు కాల్ చేశారు. పోలీసులు రాగానే స్థానికులు, పోలీసులు కలిసి విడిపించడంతో మత్తులో ఉన్న యువకుడు హల్‌చల్ చేశాడు. పోలీసులు సైతం ఏమీ చేయలేక పోయారు. చివరికి మత్తులో ఉన్న యువకుడిని అతడి స్నేహితులు వచ్చి తీసుకెళ్లారు.
- ఈ నెల 28న స్థానిక కాలేజీ రోడ్‌లో మత్తులో కారు నడుపుతున్న యువకులు ఎదురుగా వస్తున్న ఓ ప్రముఖ దినపత్రిక విలేకరికి చెందిన కారును ఢీ కొనడంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. కారులో ఉన్నవారు మత్తులో ఉన్నట్లు సమాచారం.
- జూలై 4న జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో రెండు వర్గాల మధ్య మద్యం మత్తులో దాడులకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

మందుబాబుల అడ్డాలు...

బహిరంగ ప్రదేశాలు మందుబాబులకు అడ్డాలుగా మారాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానం, ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానం, బైపాస్ రోడ్ తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో, రాళ్లవాగు సమీపంలో, కాలేజీరోడ్, శివాజీ గ్రౌండ్, హైటెక్ సిటీ వెనుకల, రైల్వేస్టేషన్ ఏ క్యాబిన్, మైసమ్మ గుడి వద్ద క్వారీరోడ్, అండాలమ్మ కాలనీ, గ్రీన్ సిటీ ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వరకు మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి అల్లర్లకు పాల్పడుతున్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మందుబాబులు తాగి పడేసిన బీరు సీసాలు

దాడులకు పాల్పడితే సహించేది లేదు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. సేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం, డ్రగ్స్, గంజాయి లాంటి మత్తులో దాడులు, అల్లర్లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. దాడులకు పాల్పడుతూ ప్రజల భద్రతకు విఘాతం కలిగించిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు.

- ఎం. శ్రీనివాసులు, సీపీ, రామగుండం

హాస్టల్ సందర్శన అడ్డగింత



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు



చెన్నూర్ మైనార్టీ గురుకుల పాఠశాల వద్ద బీఆర్‌ఎస్వీ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ మైనార్టీ గురుకుల హాస్టల్ సందర్శన చేపట్టిన బీఆర్‌ఎస్వీ, బీఆర్‌ఎస్ నాయకులను హాస్టల్ సిబ్బంది, ఎస్సైలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. హాస్టల్‌ను సందర్శించేందుకు అనుమతి లేదని తేల్చిచెప్పారు. దీంతో బీఆర్‌ఎస్వీ, బీఆర్‌ఎస్ నాయకులు హాస్టల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారని తెలిపారు. హాస్టల్‌లో జరుగుతున్న ఘటనలపై బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట తారక రామారావు హాస్టళ్ల సందర్శనకు పిలుపునిచ్చారని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం చెన్నూర్ మైనార్టీ గురుకుల హాస్టల్ సందర్శనకు వేళ్తే పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ పట్టణ అధ్యక్షుడు నాయబ్, బీఆర్‌ఎస్ నాయకులు కొప్పుల రవీందర్, నాయిని సతీశ్, వేముల మహేందర్, పాశం ఆశీశ్, ప్రశాంత్‌రెడ్డి, మనోహర్, తిరుపతి, సురేశ్, విష్ణు, సంతోశ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్, సంఘటనల దృష్ట్యా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం బీఆర్‌ఎస్వీ నాయకులు గురుకులాల బాట పట్టారు. ఆశ్రమ పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సంక్షేమం కోసం బీఆర్‌ఎస్వీ ముందుంటుందన్నారు. విద్యా వ్యవస్థ పటిష్టం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు చైతన్య, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు అరుణ్, నాయకులు రోషన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టడానికి అవకాశం ఇవ్వండి

జన్నారం: ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లోని విద్యార్థులకు యూనిఫాం కుట్టడానికి మాకు అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన కుట్టుశిక్షణ పొందిన మహిళలు సోమవారం ఎంపీడీవో శశికళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు చెందిన 94మంది మహిళలు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సహకారంతో కుట్టు శిక్షణ పూర్తిచేసి, సర్టిఫికెట్లు పొందారని, ఉపాధి పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు హారిక, అనూష, సుమలత, దీప తదితరులున్నారు.



వినతిపత్రం ఇస్తున్న శిక్షణ పొందిన మహిళలు

పశువులకు కృత్రిమ గర్భధారణతో మేలుజాతి సంతతి

భీమారం: పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల మేలుజాతి సంతతి పెరుగుతుందని మండల పశువైద్యాధికారి రాకేశ్‌శర్మ అన్నారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ఎలకేశ్వరంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. 40పశువులకు పరీక్షలు జరిపి చికిత్స అందించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ రవి, సిబ్బంది నర్సింహులు, సంపత్, రమేశ్ పాల్గొన్నారు.



పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు రాకేశ్‌శర్మ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జైపూర్: మండల కేంద్రంలో గల 33-11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లో కొత్త పరికరాలను అమర్చడానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విజయోత్సవ ర్యాలీ విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ మంగళవారం ఉదయం 10గంటలకు మున్సిపల్ ఆఫీస్ నుంచి ప్రారంభమవుతుందని పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ మున్సిపల్ ఆఫీస్ నుంచి పాత బస్టాండ్ మీదుగా రామన్‌కాలనీ వరకు సాగుతుందని తెలిపారు.

'ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలి'

పాతమంచిర్యాల: ములుగు జిల్లా చెల్పాక గ్రామ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విషప్రయోగం జరిపి, చిత్ర హింసలు పెట్టి కాల్చిచంపినట్లు మృతుల కుటుంబ సభ్యులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కగార్ ఆపరేషన్ కొనసాగించినట్లుగా ఉందని, 2026 నాటికి విప్లవ సంస్థలు లేకుండా చేస్తామని మోదీ, అమిత్‌షా ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటికి ఛత్తీస్‌గఢ్‌లో 265 మంది నక్సల్స్‌ను బూటక పు ఎన్‌కౌంటర్‌లో హత్య చేయించిందని ఆరోపించారు. ఇటీవలే నక్సల్స్ ప్రాభావిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, పోలీస్ అధికా రుల సమావేశం జరిగిందని, అందులో కేంద్రం సమన్వయంతో విప్లవ సంస్థలు లేకుండా చేయాలని ప్రణాళికలు రూపొందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలని డిమాండ్ చేశారు.

ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం సభ్యత్వ నమోదు

దండేపల్లి: స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం కృషి చేస్తుందని సంఘం జిల్లా కన్వీనర్ కొల్లూరి రవికుమార్ తెలిపారు. దండేపల్లి ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆలోచన విధానాలను గ్రామ గ్రామాన తీసుకెళ్లడంతో పాటు, సంఘాలను ఏర్పాటు చేసి సంఘాన్ని మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగం కార్యక్రమంలో ప్రజా ఫిర్యాదుల విభాగానికి మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో హాజరై, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమాల్లో సంఘం మార్గ నిర్దేశకులు బొమ్మెన మహేష్, అక్కల సురేష్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి సాయికుమార్, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు రమేష్, మహేందర్, వినయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో రవికుమార్‌తో నాయకులు

సేవాలాల్ సేన యూత్ అధ్యక్షుడిగా రవినాయక్

కాసిపేట: మండలంలోని లంబాడితండాలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ మల్లేష్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల సేవాలాల్ సేనా యూత్ అధ్యక్షుడిగా బానోత్ రవినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాదవ్ గజానంద్ హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ధారావత్ కైలాస్‌నాయక్, నాయకులు గుగులోత్ బాలాజి నాయక్, ధారావత్ రమేశ్, బాదవత్ రమేష్, అజ్మీర రాజేష్, భుక్య రమేష్ తదితరులున్నారు.



రవినాయక్

■ **బొగ్గుబాయి వార్తలు**

'రియాజ్ అరెస్ట్ అక్రమం'

శ్రీరాంపూర్: తమ యూనియన్ అధ్యక్షుడు, వెజ్‌బోర్డ్ సభ్యుడు రియాజ్ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేయడం అక్రమం అని, దీన్ని ఖండిస్తున్నట్లు హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అరెస్టును ఖండిస్తున్నాం

జైపూర్: హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డు సభ్యులు రియాజ్ అహ్మద్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో సింగరేణి కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, నాయకులను అరెస్టు చేయడం సమంజసం కాదని ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి విక్రమ్, ఉపాధ్యక్షులు సాయికృష్ణరెడ్డి, సంపత్ తెలిపారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



ఇంజనీర్ మహేష్‌ను సన్మానిస్తున్న గని మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో ఇంజనీర్‌గా పనిచేసి ఓపెన్ కాస్ట్ గనికి బదిలీపై వెళ్తున్న రుద్రారపు మహేష్‌ను గని అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గనిపై సోమవారం జరిగిన కార్యక్రమంలో మేనేజర్ తిరుపతి ఆయన్ను శాలువాతో సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 10సంవత్సరాలుగా గనిలో ఇంజనీర్‌గా సేవలందించారన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత సాధించడంలో తనవంతు కృషి చేశారన్నారు. బదిలీ అయిన చోట కూడా మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, డిప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, ఇంజనీర్ అందే శ్యాం కుమార్‌తో పాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ సంఘం సదానందం, నాయకులు కారుకూరి నగేష్, చిలుక రామచందర్, సురేష్, సంతోష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

శ్రీరాంపూర్: రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని ఆర్కే 5, 6గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ తెలిపారు. గనిపై నవంబర్ నెలలో మెరుగైన ఉత్పత్తి, ఓఎంఎస్ సాధించినందుకు ఏ రిలే ఉద్యోగులకు సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి ఉత్పత్తి లక్ష్యాల సాధనలో పోటీతత్వంతో పని చేయాలన్నారు. మెరుగైన ఓఎంఎస్ సాధించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ప్రణాళికబద్ధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్‌కుమార్, రక్షణ అధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ శివయ్య, ఫిట్ సెక్రెటరీ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఏజెంట్ శ్రీధర్

రేపు నిరసన ర్యాలీ

మంచిర్యాలఅర్బన్: హిందువులపై దాడులు ఆపాలని ఇస్కాన్ సన్యాసి చిన్మయానందస్వామిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాలలో ఈ నెల 4న హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు సోమవారం హిందూ సమితి ప్రధాన కార్యదర్శి రవీందర్ తెలిపారు. బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ర్యాలీలో ధార్మిక సంస్థలు, హిందూ సంస్థలు, అన్ని వ్యాపారవాణిజ్య సంస్థలు పాల్గొని హిందువుల ఐక్యతను చాటాలన్నారు. నగర కార్యవాహ బా పూజీ, ఉపాధ్యక్షుడు తిరుపతి, సత్యనారాయణ రెడ్డి, వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు విష్ణు పాల్గొన్నారు.

100శాతం సర్వే డేటా నమోదు

జైపూర్: మండల వ్యాప్తంగా చేపట్టిన సర్వే వివరాలను 100శాతం ఆన్‌లైన్లో నమోదు చేసినట్లుగా ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు తెలిపారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీ, కంప్యూటర్ ఆపరేటర్లు అందరూ కలిసి చేపట్టిన కుటుంబాల వారీగా డేటాను ఆన్‌లైన్లో నమోదు చేసి ఆ పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో అప్పగించినట్లు ఇందుకు కృషి చేసిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంట రక్షణకు వల!



దండేపల్లి: వన్య ప్రాణుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవ స్థలు పడుతున్నారు. దండేపల్లి మండలం నర్సాపూర్ సమీపంలో కంది, పత్తి చేను చుట్టూ, రక్షణగా ఓ రైతు ఇలా వలను రక్షణగా కట్టాడు. దీనిని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

భూమిపూజ

భీమిని: గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు భీమిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ అన్నారు. బిట్టూరుపల్లి గ్రా మంలోని ఎస్సీ కాలనీలో సోమవారం బో రుబావి కోసం భూమిపూజ చేశారు.